క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల ఎంపీ గురుమూర్తి

తిరుమల: తిరుపతి ఎంపీ గురుమూర్తి తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అనంతరం వీఐపీ విరామ సమయంలో సినీ నటుడు రాజేంద్రప్రసాద్ స్వామి వారిని దర్శించుకున్నారు.

త్వరితగతిన కేవైసీ చేసుకోండి


మాట్లాడుతున్న సహకార బ్యాంకు మేనేజర్ లిల్లీ

రామచంద్రాపురం: మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు త్వరితగతిన కేవైసీ చేసుకోవాలని కేంద్ర సహకార బ్యాంకు మేనేజర్ లిల్లీ అన్నారు. మంగళవారం స్థానిక సింగిల్ విండో కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన రైతులు తమ ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం నకళ్లను అందించి ఈ నెల 30వ తేదీలోగా కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలో జరుగుతున్న కంప్యూటరైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సహకార సంఘం ఇన్చార్జ్ సునీల్, ప్రవీణ్, శశికిరణ్, సీఈఓ కన్నయ్య, జయశేఖర్ పాల్గొన్నారు.

ఖాతాలకు కళ

తిరుపతి సిటీ: గత కొన్ని రోజులుగా ఎస్వీయూ ఉద్యోగుల బ్యాంకు ఖాతాలను స్తంభింపచేసిన ఎస్వీయూ, ఎస్‌బీఐ అధికారుల వికృత చేష్టలకు మంగళవారం తెరపడింది. జూలై మాసం జీతాలను విడుదల చేసి ఉద్యోగులు, పెన్షనర్ల ఖాతాలలో జమచేశారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన బ్యాంకు అధికారులపై న్యాయపోరాటం చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో జీతాలు, పెన్షన్లను విడుదల చేసి బ్యాంకు సిబ్బంది ఖాతాలను యథావిధిగా కొనసాగించారు. అయితే అకడమిక్ కన్సల్టెంట్ల జీతాలపై రాష్ట్ర ప్రభుత్వం, వర్సిటీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీలో పనిచేస్తున్న నాలుగో తరగతి అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించలేదని, ఇప్పటికైనా వర్సిటీ అధికారులు తమ గోడును అర్థం చేసుకోవాలని కోరుతున్నారు.

వార్షిక పరీక్ష విధానం కొనసాగించండి


వీసీకి వినతిపత్రం ఇస్తున్న నవసమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్

తిరుపతి సిటీ: ఎస్వీయూ డీడీఈలో వార్షిక ప్యాటర్న్ పరీక్షా విధానాన్నే కొనసాగించాలని నవసమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్ కోరారు. మంగళవారం వీసీ డాక్టర్ అప్పారావును కలసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెమిస్టర్ సిస్టమ్‌తో డీడీఈ విద్యార్థులకు ఉపయోగం లేదన్నారు. డీడీఈలో చదివే 90 శాతం మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులే ఉన్నారని, ఈ విషయాన్ని అధికారులు దృష్టిలో పెట్టుకుని పాత పద్ధతినే కొనసాగించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కార్యక్రమంలో ప్రకాష్‌నాయక్, సురేష్‌నాయక్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నైషికకు రంగస్థలి అవార్డు


అవార్డు పొందిన నైషికతో పాఠశాల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి కోత్సవాల్లో భాగంగా బైరాగిపట్టెడ వీక్ష ది స్కూల్ విద్యార్థిని వై.నైషికకు రంగస్థలి అవార్డు రావడం అభినందనీయమని స్కూల్ హెచ్‌ఎం ఆర్‌కే.విమల తెలిపారు. తమ స్కూల్ విద్యార్థిని ఉత్తమ ప్రతిభ చూపి అవార్డు సాధించడం గర్వంగా ఉందని, భవిష్యత్‌లో ఇంకా బాగా రాణించాలని స్కూల్ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. అలాగే అవార్డు సాధించిన విద్యార్థినిని ఆర్‌కే ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజుగౌడ్‌తో పాటు స్కూల్ ప్రతినిధులు అభినందించారు.

కేఆర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



తిరుపతి తుడా: స్థానిక వరదరాజ నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో మంగళవారం అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ రమేష్ కాపిరెడ్డి తెలిపారు. రేణిగుంటకు చెందిన 30 ఏళ్ల వయసు గల యువకుడు పొత్తికడుపు నొప్పితో ఆస్పత్రికి వచ్చాడు. టెస్ట్‌లు చేయగా ప్రాంకీయాస్ గ్రంథిలో సుమారు 19 సెం.మీ. నీటిగడ్డ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఎటువంటి కుట్లు, కోతలు లేకుండా నీటి గడ్డను తొలగించామని తెలిపారు.

హాకర్స్ దందా.. అడ్డుకట్ట పడదా..!

- శ్రీవారిమెట్టు వద్ద అనధికారికంగా వ్యాపారాలు సాగిస్తున్న హాకర్స్
- బలవంతంగా భక్తులకు పూజా సామగ్రిని అంటగడుతున్న వైనం
- భక్తులపై భౌతికదాడులకు దిగుతున్నా పట్టించుకోని విజిలెన్స్ అధికారులు
- స్థానిక ప్రజాప్రతినిధి పేరు చెప్పి అధికారులనూ బెదిరిస్తున్న హాకర్లు


శ్రీవారి మెట్టు వద్ద అనధికారికంగా దర్జాగా వ్యాపారాలు సాగిస్తున్న తిరుపతికి చెందిన కూటమి పార్టీ కార్యకర్తలు

చంద్రగిరి: కాలినడకన తిరుమలకు చేరుకునే శ్రీవారి భక్తులను అనధికారి హాకర్లు నిలువునా దోచేస్తున్నారు. నాసిరకం పూజాసామగ్రిని విక్రయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే శ్రీవారి భక్తులపై సైతం దాడులకు పాల్పడుతున్నారు. అనధికారి హాకర్లను పంపించేందుకు వెళ్లిన అధికారులను సైతం స్థానిక ప్రజాప్రతినిధి పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వివరాల్లోకు వెళ్తే.. తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి అత్యంత సమీప మార్గంగా శ్రీవారిమెట్టు ఉంది. దీంతో ప్రతిరోజు వేలాది మంది భక్తులు శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్తారు. ఈ క్రమంలో శ్రీవారిమెట్టు ప్రధాన గేటు వద్ద కొంత మంది మహిళలు అనధికారికంగా గత కొద్ది నెలలుగా వ్యాపారాలు సాగిస్తున్నారు. తిరుపతి నుంచి నాసిరకమైన పూజాసామగ్రిని తీసుకొచ్చి అధిక ధరలకు భక్తులకు బలవంతంగా అంటగడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాసిరకం పూజాసామగ్రిపై ప్రశ్నిస్తే తిరిగి భక్తులపైనా తిరగబడుతున్నారు. గతంలో కూడా మహిళలపై భౌతిక దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయి. అక్కడ అధిక ఆదాయం వస్తుండడంతో పోటీ వ్యాపారం పెరిగింది. ఈ క్రమంలో పదుల సంఖ్యలో అక్కడ మహిళలు తిష్ట వేసి, నిరంతరం శ్రీవారి భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వారిలో వారే పరస్పర దాడులకు దిగుతున్నారు. దీంతో శ్రీవారి భక్తులు భయాందోళకు గురవుతున్నారు.

విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యమే కారణమా..?

గతంలో అనధికార హాకర్లు అటవీ పరిధిలోని ప్రాంతంలో వ్యాపారాలు సాగించేవారు. దీంతో అటు టీటీడీ, ఇటు అటవీ అధికారులు తమ పరిధి కాదంటే తమది కాదంటూ దాట వేస్తున్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వ్యాపారులంతా కూటమి పార్టీకి చెందిన వారేనని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు ఏకంగా ప్రధాన ద్వారం, ఫిల్టర్ హౌస్, శ్రీవారిమెట్టు మొదటి మెట్టు వద్ద తిష్ట వేశారు. టీటీడీ పరిధిలో వ్యాపారాలు సాగిస్తూ ఇలా నిలువు దోపిడీకి పాల్పడుతున్నా టీటీడీ విజిలెన్స్ అధికారులు మాత్రం ఇవేవీ పట్టనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. అక్కడే గతంలో మూడు దుకాణాలను టీటీడీ టెండరు ద్వారా మంజూరు చేసింది. రూ.లక్షల్లో వారు టీటీడీకి అద్దెలు చెల్లిస్తున్నారు. అయితే అనధికార హాకర్లు విచ్చలవిడిగా వ్యాపారాలు సాగించడంతో అద్దెలు చెల్లించుకోలేక దుకాణాదారులు అవస్థలు పడుతున్నారు. వ్యాపారులను అక్కడ నుంచి పంపించేందుకు కిందస్థాయి సిబ్బంది ప్రయత్నిస్తే వారిపైనా హాకర్స్ తిరగబడుతున్నట్లు తెలుస్తోంది.

రోజూ వేలల్లో ఆదాయం..


అనధికార దుకాణాలను తీసేయాలని చెబుతున్నా, పట్టించుకోకుండా దర్జాగా కూర్చున్న హాకర్లు

అనధికారికంగా టీటీడీ పరిధిలో వ్యాపారాలు సాగిస్తున్న హాకర్లకు రోజుకు వేలల్లో ఆదాయం వస్తుండడంతోనే ఇలా దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. పదుల సంఖ్యలో ఉన్న వ్యాపారులు ఒక్కొక్కరు రోజుకు పెట్టుబడి పోను సుమారు రూ.5 వేలకు పైగా ఆదాయం ఆర్జిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన నెలకు సుమారు రూ.లక్షన్నర పైమాటే. భక్తులను నిలువుదోపిడీ చేస్తున్న హాకర్లను అడ్డుకోవడంలో విజిలెన్స్ సిబ్బంది విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా రాజకీయా ఒత్తిళ్లను ఎదురొడ్డి శ్రీవారి భక్తులను దోచుకుంటున్న అనధికారి హాకర్లపై చర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

విఖనసాచార్యుల సన్నిధికి మలయప్పస్వామి


విఖనసాచార్యుల సన్నిధిలో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు మంగళవారం ఉత్తర మాడవీధిలో గల విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేశారు. విఖనస మహర్షి జయంతి శ్రావణ పౌర్ణమి నాడు జరిగింది. ఆ మరుసటి రోజు స్వామి, అమ్మవార్లు విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేయడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం నిత్యకైంకర్యాలు, సేవలు, ఉత్సవాలు జరుగుతాయి. ఈ వైఖానస ఆగమశాస్త్రాన్ని శ్రీ విఖనస మహర్షి రచించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఆస్థానం నిర్వహించి నివేదన చేపట్టారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం

– జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు


ఫొటో జర్నలిస్టులతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి కల్చరల్: జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి ప్రాధాన్యత ఉంటుందని, ఆధ్యాత్మిక తిరుపతి నగరంలో శాంతిభద్రతలు కాపాడడం ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో గత రెండు రోజులుగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ మంగళవారంతో ఘనంగా ముగిసింది. ఈ ఎగ్జిబిషన్‌ను పలు పాఠశాలల విద్యార్థులు తిలకించారు. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశానికి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించి పలువురు ఫొటో జర్నలిస్టులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులది ఒత్తిడితో కూడుకున్న వృత్తి అని తెలిపారు. అలాగే నగరంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఫొటో జర్నలిస్టులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణ, లావణ్యకుమార్, కోశాధికారి శివయ్య, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రతిష్ఠించే వరకు ఉద్యమిస్తాం


మాట్లాడుతున్న ఎస్వీయూ పూర్వ ప్రిన్సిపల్ మురళీధర్

తిరుపతి కల్చరల్: పార్లమెంట్‌లో దండం స్థానంలో రాజ్యాంగాన్ని ప్రతిష్ఠించేంత వరకు ఉద్యమిస్తామని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఏఐడీఆర్‌ఎం జాతీయ సమితి సమావేశాల సందర్భంగా మంగళవారం గంధమనేని శివయ్య భవన్‌లో భారత పార్లమెంట్‌లో రాజదండం స్థానంలో రాజ్యాంగం ప్రతిష్ఠించాలనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తంగా విచ్చేసిన ఎస్వీయూ పూర్వ ప్రిన్సిపల్ కేవీ మురళీధర్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రజాస్వామ్య స్థానంలో రాచరిక వ్యవస్థకు పునాది వేయాలని చేస్తున్నారని ఇది యావత్ దేశ ప్రజానీకం గమనిస్తోందని, బీజేపీ భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను ధ్వంసం చేస్తూ అదానీ, అంబానీలకు ఊడిగం చేస్తూ కార్పొరేట్ కబంధ హస్తాల్లో దేశాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నేత మాగంటి గోపాల్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రభాకర్, సుబ్బారావు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా నేతలు, ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య పాల్గొన్నారు.

భోజరాజు మృతి బాధాకరం


భోజరాజు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న అసోసియేషన్ నేతలు, సభ్యులు

తిరుపతి కల్చరల్: సమాజంలోని మెకానిక్‌ల శ్రమను గుర్తించి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఏర్పాటుతో వారి వృత్తికి భద్రత, భరోసా ఇచ్చిన దార్శనికుడు భోజరాజు అని తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి కొనియాడారు. ఎస్‌టీవీ నగర్‌కు చెందిన భోజరాజు మంగళవారం ఆకస్మిక మృతి చెందారు. ఈ సందర్భంగా తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీలో మెకానిక్‌గా పని చేసి మెకానిక్‌ల శ్రమను గుర్తించి ఆయన 1993లో మొట్టమొదటిసారి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ ఏర్పాటు చేసి మెకానిక్ జీవితాలకు మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. మెకానిక్‌ల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన ఆయన ఆకస్మిక మరణం మెకానిక్ లోకానికి తీరని లోటు అని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ భవన్ నుంచి ఎస్‌టీవీ నగర్ వరకు భారీ స్కూటర్ ర్యాలీ చేపట్టారు. అనంతరం భోజరాజు మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారుడు లక్ష్మణరావు, గౌరవాధ్యక్షుడు మల్లీశ్వర్, ఉపాధ్యక్షుడు ప్రభు, కార్యదర్శి జలంధర్, సహాయ కార్యదర్శి గురుఆచారి, కోశాధికారి బాబు, కమిటీ ఇన్‌చార్జ్ సోమశేఖర్, కేశవ, జాకీర్, అరుణ్, సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం


మాట్లాడుతున్న టాటా ట్రస్ట్ ప్రతినిధి హేమంత్

తిరుపతి కల్చరల్: ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలు ఆహారంగా తీసుకుని ఆయుష్షువంతులుగా జీవించాలని టాటా ట్రస్ట్ ప్రతినిధి హేమంత్ తెలిపారు. రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ వారి సహకారంతో మంగళవారం నెహ్రూ నగర్ క్లస్టర్‌లోని రాస్ కార్యాలయంలో ఉచిత క్యాన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కలుషితమైన ఆహారం అలవరచుకుని అనారోగ్యం బారిన పడతారన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గోబీ, చికెన్‌ఫ్రైడ్ రైస్, బిర్యానీ వంటి మసాలా పదార్థాలు అనారోగ్యానికి దారి తీస్తాయని తెలిపారు. సజ్జలు, రాగులు, జొన్నలు, కొర్రలు, సామలు, అరికలు వంటి వాటిని చిన్నతనం నుంచే పిల్లలకు అలవాటు చేయాలన్నారు. తద్వారా పిల్లల ఎదుగుదలకు దోహదపడడంతో పాటు భవిష్యత్‌లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దూరం కావచ్చని తెలిపారు. రాస్ అధికారి నాగరాజు మాట్లాడుతూ కోవిడ్-19 నేర్పిన పాఠాల నుంచి ప్రజలు వ్యాధి నిరోధక శక్తిని ఇచ్చే సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం సుమారు 150 మందికి ఉచితంగా బీపీ, షుగర్, హెపటైటిస్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో దోమలు దూరం


బ్యానర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

చంద్రగిరి: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చని చంద్రగిరి మెడికల్ అధికారి డాక్టర్ శిరీష అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఈశ్వరయ్య, శివయ, చింతామణి, వాసుదేవ, వెంకటేశ్వరరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో రోగాలు దూరం

తిరుపతి అర్బన్: ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ వైద్యాధికారులతో కలసి బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులు సంక్రమిస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించి విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీహరి, సంధ్యారాణి, వైద్యాధికారులు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణం


స్వామి, అమ్మవారి కల్యాణం జరుపుతున్న వేదపండితులు

రామచంద్రాపురం: మండలంలోని సీరామాపురంలో గల శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నిర్వహిస్తున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ద్రౌపదీదేవి కల్యాణం వైభవంగా జరిగింది. పట్టుపీతాంబరాలు, సుగంధభరిత పుష్పమాలికలు, వివిధ రకాల ఆభరణాలతో ద్రౌపదీదేవి, ధర్మరాజులు ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలుగా కొట్టే నరసింహారెడ్డి, తేజోవతి దంపతులు వ్యవహరించారు. భాగవతారిణి అనసూయ ద్రౌపదీదేవి స్వయంవరం, అర్జునుడు మత్స్య యంత్రాన్ని పడగొట్టడం వంటి ఘట్టాలను వీనులవిందుగా ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

27న గోకులాష్టమి ఆస్థానం

తిరుమల: శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 27న శ్రీవారి ఆలయ బంగారు వాకిలి ముఖ మండపంలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు గోకులాష్టమి ఆస్థానం నిర్వహిస్తారు. బంగారు సర్వభూపాల వాహనంపై శ్రీకృష్ణస్వామిని వేంచేపు చేసి నివేదనలు సమర్పిస్తారు. శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు, శ్రీకృష్ణస్వామికి ఏకాంత తిరుమంజనం, అనంతరం ద్వాదశారాధనం నిర్వహిస్తారు. అలాగే 28న తిరుమలలో ఉట్లోత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి శ్రీ మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై తిరుమాడ వీధులలో విహరిస్తారు. యువకులు ఎంతో ఉత్సాహంతో ఉట్లను కొడుతూ స్వామివార్లకు ఆనందం కలిగిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 28న శ్రీవారి ఆలయంలో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

వినాయక నిమజ్జనానికి సహకరించండి


వినతిపత్రం ఇస్తున్న వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు

తిరుపతి తుడా : వచ్చే నెల 7వ తేదీ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అందుకు తగ్గట్లు విగ్రహాల నిమజ్జనానికి తుడా అధికారులు సహకరించాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ విన్నవించింది. ఈ మేరకు మంగళవారం తుడా వైస్ చైర్మన్ వెంకట నారాయణను కలసి వినతి పత్రం అందించారు.

కబ్జా కహానీ



ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపించింది...! అయితే ఇంకేముంది పాగా వేసేయ్ అంటూ కొంత మంది బరితెగిస్తున్నారు. చంద్రగిరికి కూతవేటు దూరంలో అక్కగార్ల కాలనీ ఉంది. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ప్రజల సౌకర్యార్థం గ్రామ సచివాలయం, ఆర్‌బీకే సెంటర్ నిర్మాణ పనులను 90శాతం మేర పూర్తిచేశారు. ఈ క్రమంలో సచివాలయ భవనానికి వెనుక ఉన్న సర్వే నంబరు 1479లోని ప్రభుత్వ భూమిపై కొంతమంది కన్నేశారు. దీంతో గత కొద్ది రోజులుగా ఇంటి నిర్మాణాలను వేగవంతం చేశారు. పురావస్తు శాఖ నిబంధనల ప్రకారం కోట ప్రహరీ నుంచి 100 మీటర్ల వరకు ఎటువంటి నిర్మాణాలను చేపట్టకూడదు. అయితే ఎటువంటి అనుమతులు, పత్రాలు లేకపోయినప్పటికీ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు అక్కడే అంగన్‌వాడీ భవనం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన భవనం సమీపంలోని 11 అడుగుల ప్రభుత్వ స్థలాన్ని సైతం ఆక్రమించుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, ఆర్కియాలజీ అధికారుల నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

– చంద్రగిరి

వ్యక్తిపై కేసు

ఏర్పేడు: మండలంలోని పంగూరు ఎస్సీ కాలనీకి చెందిన ఆదిలక్ష్మిపై అదే కాలనీకి చెందిన యుగంధర్ మద్యం మత్తులో దాడిచేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు మంగళవారం చెప్పారు.